ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

సోమవారం 29 జనవరి 2024



జాయింట్ కలెక్టర్‌గా అంబేడ్కర్



పార్వతీపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్‌గా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నియమితుల య్యారు. ప్రస్తుతం జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తు న్న ఆర్.గోవిందరావుకు సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ అదనపు డైరెక్టర్‌గా బదిలీ అయింది. అంబేడ్కర్ గతం లో పార్వతీపురం ఆర్డీవోగా, పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. త్వరలోనే జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

- తప్పులు తడకగా ఓటరు జాబితా
- డబుల్ ఎంట్రీలు నమోదు
- ఫొటో లేకుండానే పేర్లు
- మృతుల పేర్లు తొలగించని వైనం


ఆత్మలకూ ఓట్లు

పార్వతీపురం, (ఆంధ్రజ్యోతి)/ భామిని, జనవరి 28: ఇటీవల కలెక్టర్ ప్రకటించిన ఓటరు తుది జాబితా తప్పులతడకగా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. జాబితాలో డబుల్ ఎంట్రీలు ఉన్నాయి. అలాగే మృతి చెందిన వారి పేర్లను పూర్తిస్థాయిలో తొలగించలేదు. ఉన్నతాధికారులు ఎంత చెప్పినా కిందిస్థాయి అధికారులు మాత్రం పూర్తిస్థాయిలో ఓటరు జాబితాపై దృష్టి కేంద్రీకరించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ● కురుపాం నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్ నెంబర్ 200లో క్రమసంఖ్య 21లో దొనొండ లావణ్య పేరు ఫొటో లేకుండా ఓటరు జాబితాలో నమోదైంది. క్రమసంఖ్య 722లో హర్షవర్ధన్ నారాయణపురం పేరు నమోదు కాగా, అదే పేరు సీరియల్ నెంబర్ 723లో నమోదై ఉంది. సీరియల్ నెంబర్ 529లో పేరు ఉన్న బి.అప్పలనాయుడు నాలుగేళ్ల క్రితం మృతి చెందారు. అదే విధంగా సీరియల్ నెంబర్ 530లో బి.గంగమ్మ మృతి చెందినప్పటికీ ఆమె పేరు జాబితాలో ఉంది. ● భామిని మండలం కొరమ 149 పోలింగ్ కేంద్రంలో క్రమసంఖ్య 675లో బిడ్డిక కరువు, 693లో బి.సావిత్రమ్మ, 308లో బి.సింహాచలం తదితరులు మృతి చెందినప్పటికీ వారిపేర్లు జాబితాలో కొనసాగుతున్నాయి. అలాగే 136, 171, 231 క్రమసంఖ్యలో గ్రామంలో లేని వారి పేర్లు దర్శనమిస్తోన్నాయి. ఈ విధంగా జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఓటరు జాబితా తప్పులు తడకగా ఉంది. సరిచేయాలని బీఎల్‌వోలకు విన్నవించినా పరిష్కారం కాలేదని పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి శతశాతం తప్పులు లేకుండా ఓటరు జాబితా తయారు చేయాలని కోరుతున్నారు.






కురుపాంలో మృతి చెందిన అప్పలనాయుడు, గంగమ్మ పేర్లు ఓటు జాబితాలో ఉన్న దృశ్యం



కురుపాం ఓటరు జాబితాలో రెండుసార్లు నమోదైన హర్షవర్ధన్ నారాయణపురం పేరు





కొరమలో మృతిచెందిన కరువు బిడ్డికి, సావిత్రమ్మ పేర్లు ఓటరు జాబితాలో ఉన్న దృశ్యం



కురుపాం నియోజకవర్గంలో ఫొటో లేకుండా ఓటరుగా నమోదైన లావణ్య పేరు



ప్రజాభిప్రాయ సేకరణకు ఈపీడీసీఎల్ కార్యాలయంలో చేసిన ఏర్పాట్లు

నేటి నుంచి ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణ

- విద్యుత్తు కొనుగోళ్లు, చార్జీల పెంపుపై విశాఖ వేదికగా విచారణ
- వర్చువల్ విధానంలో అభిప్రాయాలు తెలపనున్న 71 మంది
- నాలుగు రోజులపాటు కార్యక్రమం

విశాఖపట్నం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఆధ్వర్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదిత చార్జీల పెంపు, విద్యుత్ కొనుగోళ్లపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణను సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నారు. విశాఖపట్నంలోని ఏపీ ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో వర్చువల్ విధానంలో నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ మేరకు ఆదివారం ట్రయల్ రన్ నిర్వహించారు. ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనేందుకు ఏపీఈఆర్‌సీ అధికారులతోపాటు ఏపీ ఇంధనశాఖ, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో, సీపీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు ఆదివారం నగరానికి చేరుకున్నారు. ఏపీఈఆర్‌సీ ఛైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, సభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, పీవీఆర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ సంస్థల ప్రతిపాదనలకు సంబంధించిన సూచనలు, అభ్యంతరాలు, అభిప్రాయాలను వీడియో కాన్ఫరెన్స్ (వర్చువల్) విధానంలో స్వీకరించనున్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని విద్యుత్ పంపిణీ సంస్థల చార్జీల ప్రతిపాదనలపై 63 మంది, ఏపీ జెన్‌కో ప్రతిపాదనలపై ఎనిమిది మంది మొత్తంగా 71 మంది అభిప్రాయాలను తెలియజేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం 17 మంది, మంగళవారం 23 మంది, బుధవారం 23 మంది, గురువారం ఎనిమిది మంది అభిప్రాయాలను తెలియజేయనున్నారు. ఏపీఈఆర్‌సీ వద్ద ముందుగా పేర్లు నమోదు చేసుకోని వారు కూడా ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని అభిప్రాయాలను తెలియజేయాలనుకుంటే సమీప విద్యుత్ పర్యవేక్షణ ఇంజనీర్ (ఎస్‌ఈ), ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) కార్యాలయాల్లో సంప్రదించాలని అధికారులు సూచించారు. ఏపీ ఈఆర్‌సీ అనుమతితో రోజూ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి రెండు గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వివరించారు.

ఎంత మోసం!

- సమాన పనికి సమాన వేతనం ఇస్తామని ప్రభుత్వ హామీ
- సమ్మె కాలానికి కూడా ఇస్తామని ప్రకటన
- రెండు వారాలు దాటినా విడుదల కాని జీవో
- ఆందోళనలో ఎస్‌ఎస్‌ఏ కాంట్రాక్టు ఉద్యోగులు



సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు (ఫైల్)

(గరుగుబిల్లి)

సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్‌ఎస్‌ఏ)లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, పార్ట్ టైమ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అందిస్తామని చెప్పి ప్రభుత్వం మోసం చేసింది. పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల పరిధిలోని ఎస్‌ఎస్‌ఏ సిబ్బంది పలు సమస్యలపై గత డిసెంబరు 20 నుంచి సమ్మె బాట పట్టారు. సుమారు 23 రోజులకు పైగా వినూత్న రీతిలో నిరసనలు తెలిపారు. అయితే ప్రభుత్వం వీరితో జనవరి 11నచర్చలు నిర్వహించింది. ఏడు విభాగాలకు సంబంధించి వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చింది. ఇందులో పార్ట్ టైమ్, సైట్ ఇంజనీర్లు, మెసెంజర్లతో పాటు మరో నాలుగు విభాగాలు ఉన్నాయి. అయితే వీరికి 23 శాతం పెంపుదల చేస్తామని ప్రకటించినా నేటికీ జీవో రాని పరిస్థితి ఏర్పడింది. అలాగే సమ్మె కాలానికి వేతనం అందిస్తామన్న హామీ కూడా నెరవేర్చలేదు.

మాయ మాటలు..

జిల్లాలో 110 మంది సీఆర్‌పీలు, 15 మంది ఎస్‌ఐఎస్ కోఆర్డినేటర్లు, 15 మంది ఎల్‌డీఏలు, 247 మందికి పైగా కేజీబీవీ సిబ్బంది, 15 మంది మెసెంజర్లు, 184 మంది పార్ట్ టైమ్ ఉద్యోగులు ఉన్నారు. మొత్తం సుమారు 586 మందికి పైగా వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్నారు. తాము పలు సమస్యలతో సతమతమవుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగ భద్రత లేక, చాలీచాలని వేతనాలతో అల్లాడుతున్నామని వాపోతున్నారు. బాధ్యతలు ఎక్కువ, వేతనాలు తక్కువతో కుటుంబ భారాన్ని మోయలేక ఉక్కిరిబిక్కిరవుతున్నామని ఆవేదన చెందుతున్నారు. అరకొర వేతనాలతో విధులు నిర్వహించేదెలా అని ప్రశ్నిస్తున్నారు. కేటగిరీల వారీగా రూ.18 వేల నుంచి రూ.32 వేలు వరకు వేతనాలు పొందుతున్నారు. దీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్నా ఉద్యోగ భద్రత లేని పరిస్థితిలో ఉన్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారుల ఆగ్రహానికి గురైతే ఉద్యోగం ఊడుతుందన్న భయం వీరిలో వెంటాడుతుంది. సర్వ శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు పరిధిలో ఒకే క్యాడర్ ఉద్యోగులకు రకరకాల వేతనాలను చెల్లిస్తున్నారు. ఎన్నికల ముందు సీఎం జగన్ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ మంజూరు చేసి ఉద్యోగ భద్రత కల్పిస్తామని మాయ మాటలు చెప్పారన్నారు. గద్దెనెక్కిన తరువాత వాగ్దానాలు గాలిలో కలిశాయన్నారు. సుమారు 20 రోజులకు పైగా సమస్యలు పరిష్కారానికి సమ్మె నిర్వహించినా అనుకున్న మేరకు ఫలితాలు రాక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చర్చలు సమయంలో హామీలు ఇచ్చిన మేరకు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వాగ్దానాలను అమలు చేయాలి..

సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం అందించాలి. ఒకే క్యాడర్‌లో విధులు నిర్వహించే వారికి రకరకాల వేతనాలు చెల్లించడం సరికాదు. కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న వారందరికీ రెగ్యులర్ చేసి పార్ట్ టైమ్ ఎంప్లాయిస్‌ను ఫుల్ టైమ్ కాంట్రాక్టులోకి మార్చి జీతాలు పెంచాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలి.

-పోలినాయుడు, జేఏసీ జిల్లా అధ్యక్షుడు, పార్వతీపురం మన్యం జిల్లా

ఉద్యోగ భద్రత కల్పించాలి..

సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలి. పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలి. ప్రభుత్వ ఉద్యోగులకు అందించే బెనిఫిట్స్‌ను వర్తింపజేయాలి. అరకొర వేతనాలతో కుటుంబ పోషణ కష్టతరంగా ఉంది. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని వేతనాలు పెంచి భద్రత కల్పించాలి.

-ప్రకాష్, ఎంఐఎస్ కోఆర్డినేటర్, జిల్లా అధ్యక్షుడు, మన్యం జిల్లా



చదురుగుడిలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పోలమాంబ దర్శనానికి పోటెత్తిన భక్తులు

మక్కువ, జనవరి 28: శంబర పోలమాంబ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే చదురుగుడి భక్తులతో నిండిపోయింది. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరి కనిపించారు. గోముఖీ నదీ తీరాన భక్తులు అమ్మవారికి కోళ్లు, చీరలు చూపించి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం మారు జాతర సందర్భంగా ఆలయ అధికారులు భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.



శంబర పోలమాంబ

ఇంకెన్నాళ్లు?

- శిథిల భవనాల్లో పశు వైద్య శాలలు
- నూతన నిర్మాణాలకు నోచుకోని వైనం
- ఉద్యోగులు, రికార్డులు, మందులకు భద్రత కరువు
- వేధిస్తున్న సిబ్బంది కొరత

(జియ్యమ్మవలస)

ఆ భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. రెండు న్నర దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనాల గోడలు ప్రస్తు తం బీటలు వారాయి. శ్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. దీంతో అక్కడి సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వ హిస్తున్నారు. ఇదీ మండలంలోని పశు వైద్య చికిత్సాలయాల పరిస్థితి. మండలంలో జియ్యమ్మవలస, చినమేరంగిలో పశు వైద్య చికిత్సాలయాలు ఉన్నాయి. ఈ రెండు భవనాలను 1998లో అప్పటి పార్లమెంటు సభ్యులు శత్రుచర్ల విజయరామరాజు తన ఎంపీ ల్యాడ్ నిధులతో నిర్మించారు. చినమేరంగి పశు వైద్యశాల పరిధిలో 9 సచివాలయాలు ఉన్నాయి. చినమేరంగి, పెదమేరంగి, కన్నపుదొరవలస, బిత్రపాడు, గవరమ్మపేట, చింతలబెలగాం, ఎం.అల్లువాడ, పరజపాడు, కుదమ సచివాలయాలు ఉన్నాయి. సుమారు 4 వేల పశు సంపద వీటి పరిధిలో ఉంది. అలాగే జియ్యమ్మవలస పశు వైద్యశాల పరిధిలో డంగభద్ర, జియ్యమ్మవలస, బీజే పురం, శిఖబడి, గెడ్డతిరువాడ, ఇటిక, పెదబుడ్డిడి, తురకనాయుడువలస, అంకవరం, అర్నాడ, అలమండ సచివాలయాలు ఉండగా వీటి పరిధిలో 6 వేల వరకు పశు సంపద ఉంది. ఇవి కాకుండా తాళ్లడుమ్మ పంచాయతీ పరిధిలో రావాడ వద్ద రూరల్ లైవ్ స్టాక్ యూనిట్ (ఆర్ఎల్‌యూ) ఉంది. దీని పరిధిలో టీకే జమ్ము, పీటీ మండ, కొండచిలకాం, తుంబలి, తాళ్లడుమ్మ సచివాలయాలు ఉన్నాయి. ఇక్కడ కూడా సుమారు 3 వేల వరకు పశు సంపద ఉంది. ఇక్కడ అంతా బాగానే ఉన్నా చినమేరంగి, జియ్యమ్మవలస పశు వైద్య చికిత్సాలయాల్లో మాత్రం ప్రధానంగా వసతి సమస్య వేధిస్తోంది. ఇక్కడ భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. అప్పుడప్పుడు శ్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. వర్షం పడితే నీరు కారిపోతుంది. ఏ క్షణం ఏం జరుగుతుందోనని ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. ముఖ్యంగా వర్షం పడితే శ్లాబ్ చిమ్ముతూ అక్కడ ఉంచిన మందులు తడిసి పాడైపోతున్నాయని, రికార్డులు చెదలు పట్టి చిరిగిపోతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. రికార్డులకు, ఉద్యోగులకు, మందులకు ఈ భవనాల్లో భద్రత లేకుండాపోయిందని ఆవేదన చెందుతున్నారు. దీంతో చినమేరంగిలో ఆరుబయట మందులు ఉంచి చికిత్స అందిస్తున్నారు.



కూలడానికి సిద్ధంగా ఉన్న చినమేరంగి వెటర్నరీ ఆసుపత్రి

సిబ్బంది కొరత..

చినమేరంగి పశు వైద్య చికిత్సాలయంలో పశు వైద్యాధికారి, వెటర్నరీ అసిస్టెంట్, అటెండర్ మూడు పోస్టులు ఖాళీయే. కానీ, ఆ స్థానంలో డిప్యుటేషన్‌పై ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే జియ్యమ్మవలస పశు వైద్య శాలలో వెటర్నరీ అసిస్టెంట్‌ను నియమించి వెంటనే అతన్ని జిల్లా కేంద్రంలోని జాయింట్ డైరెక్టర్ ఆఫీసుకు డిప్యుటేషన్‌పై తీసుకెళ్లారు. ఫలితంగా పశువులకు చికిత్స అందించడంలో కొంత ఇబ్బందులు తప్పడం లేదు. కలెక్టర్ కలుగజేసుకొని నూతన భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయడంతో పాటు పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించాలని పాడిరైతులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది..



పశు వైద్య చికిత్సాలయాల పరిస్థితి, సిబ్బంది పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించాం. ఈ విషయం వారి దృష్టిలో ఉంది.

-ఎన్.ముని కుమార్, పశు వైద్యాధికారి, జియ్యమ్మవలస



శిథిలావస్థలో ఉన్న జియ్యమ్మవలస పశు వైద్య చికిత్సాలయం



చినమేరంగిలో ఆరుబయటే ఉంచిన మందులు

రేకుల షెడ్డే పశువైద్య కేంద్రం

వీరఘట్టం: మండలంలోని కడకెల్ల గ్రామంలో 1986లో గ్రామీణ పశుగణాభివృద్ధి ఉప కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామ ప్రజల సహకారంతో నిర్మించిన ఈ భవనం శిథిలావస్థకు చేరి గతేడాది జూన్‌లో కూలిపోయింది. గ్రామస్థులు ఎన్నిమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా కొత్త భవనానికి నిధులు మంజూరు చేయడం లేదు. దీంతో పక్కనే ఉన్న రేకులషెడ్‌లో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ జి.శ్రీనివాసరావు విధులు నిర్వహిస్తున్నారు. గ్రామంలోని పంచముఖ ఆంజనేయసేవా సమితి ఆధ్వర్యంలో నిధులను సేకరించి శిథిలమైన భవనం స్థానంలో కొత్తగా పునాదులను నిర్మించారు. అధికారులు నిధులు మంజూరు చేయకపోవడతో మిగిలిన పనులు కూడా నిధులను సేకరించి పూర్తి చేస్తామని సేవా సమితి సభ్యులు చెబుతున్నారు. ఈ విషయాన్ని మండల పశువైద్యాధికారి చైతన్య శంకర్ వద్ద ప్రస్తావించగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, నిధులు మంజూరైన వెంటనే కొత్త భవనం నిర్మిస్తామని తెలిపారు.



రేకులషెడ్‌లో విధులు నిర్వహిస్తున్న లైవ్‌స్టాక్ అసిస్టెంట్ శ్రీనివాసరావు



చందాలతో నిర్మించిన పునాది

బొబ్బిలి ఎమ్మెల్యేకు మరో షాక్

● అలజంగిలో వైసీపీ ఫ్లెక్సీలు పీకేసిన కార్యకర్తలు, నాయకులు

● పార్టీలోకి ఆహ్వానించేందుకు గ్రామానికి వెళ్లిన బేబీనాయన

బొబ్బిలి, జనవరి 28: బొబ్బిలి వైసీపీకి మరో భారీ షాక్ తగిలింది. మండలంలో పెద్ద గ్రామం, వైసీపీకి అండగా నిలచిన అలజంగి నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి వెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. గ్రామంలో గల వైసీపీ కార్యాలయంలో ఉన్న వైసీపీ ఫెక్సీలను ఆదివారం రాత్రి నాయకులు, కార్యకర్తలు పీకేశారు. గ్రామ సర్పంచ్ భద్రమ్మ, ఆమె భర్త బుజ్జితో పాటు పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరుందుకు నిర్ణయం తీసుకోవడంతో పార్టీ ఫ్లెక్సీలను చించి పారేశారు. వారందరినీ పార్టీలోకి ఆహ్వానించేందుకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన ఆదివారం రాత్రి గ్రామానికి చేరుకుని ఆ నాయకులతో మంతనాలు జరిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు జేజేలు పలికారు. ఇప్పటికే తెర్లాం మండలంలో భారీ సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు, నాయకులు టీడీపీలో చేరుతున్న సంగతి తెలిసిందే. రామభద్రపురం, బొబ్బిలి పట్టణం నుంచి కూడా వైసీపీ నుంచి పెద్ద ఎత్తున వలసలు ప్రారంభమవుతున్నాయి.



అలజంగిలో వైసీపీ ఫ్లెక్సీలను చించేస్తున్న ఆ పార్టీ కార్యకర్తలు

ఈ 70 రోజులూ.. సైనికుల్లా పనిచేయండి

● రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్

రాజాం: అందరూ 70 రోజులపాటు సైనికుల్లా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీ మోహన్ పిలుపునిచ్చారు. ఆదివారం పురపాలక సంఘం పరిధిలో గల కాలేపు వీధిలోని దేవాంగుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భం గా మొగదాల సతీష్, మొగదాల శ్రీను, బల్ల సాయిలక్ష్మి, ముప్పాన గవరరాజు, ముప్పాన శ్రీను, కందన భాస్కర రావు, ఆశపు నీలాద్రి, ఆశపు చంటిబాబు, కొమ్మాన మల్లిబాబు, వట్టి గణేష్, ఆశపు రాము, ముప్పాన అప్పల రాజు, ఆనాం నాగరాజుతో పాటు మరికొంతమంది దేవాంగులు టీడీపీలో చేరారు. అనంతరం టీడీపీ జెండా ఆవిష్కరించి మురళీమోహన్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత కార్మికులు నేస్తున్న చేనేత వస్త్రాలకు ధరలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఐదేళ్లలో తొమ్మిదిసార్లు కరెంట్ చార్జీలు పెంచారని, వైసీపీ ప్రభుత్వాన్ని నిలదీస్తే అక్రమంగా కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, కిమిడి అశోక్‌కుమార్, పొట్నా చిట్టిబాబు, గురవాన నారాయణరావు, బనిశెట్టి వెంకటరావు, కొనపల బసవరాజు, ఆశపు సూర్యరావు, మొగదాల సూర్యరావు, మొగదాల సతీష్, శాసపు రమష్‌కుమార్, దుప్పలపూడి శ్రీనివాసరావు, మరిపి జగన్మోహన్‌రావు, గిరడ తవిటినాయుడు, కెల్ల వెంక టరమణ, టంకాల నాగరాజు, వంగా వెంకటరావు, శాసపు రాజేష్‌కుమార్, తూతిక చిట్టిబాబు, కాటం శ్రీను పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా వేస్తున్న కోండ్రు

ఉత్తమ సబ్‌స్టేషన్‌గా గరివిడి

రింగ్‌రోడ్డు: విజయవాడలో ఏపీ ట్రాన్స్‌కో విద్యుత్ సౌదాలో జరిగిన గణతంత్ర దినోత్స వేడు కల్లో రాష్ట్రస్థాయిలో 220 కేవీ సబ్ స్టేషన్ మెంటినెన్స్ విభాగంలో ఉత్తమ 220 కేవీ సబ్‌స్టేషన్ గరి విడి ఎంపికయ్యింది. ఈ అవార్డును ఏపీ ట్రాన్స్‌కో చైర్మన్, మేనే జింగ్ డైరెక్టర్ విజయానంద్ చేతుల మీదుగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఏ.సురేష్ అందుకున్నారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో విజయనగరం జిల్లాలో గల గరివిడి సబ్‌స్టేషన్‌కు ఈ అవార్డు రావటం చాలా ఆనందగా ఉందన్నారు.



అవార్డు అందచేస్తున్న ట్రాన్స్‌కో చైర్మన్, ఎండీ విజయానంద్

ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధం

విజయనగరం దాసన్నపేట, జనవరి 28: రా ష్ట్రంలో జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జనసేన నాయకులు గురాన అ య్యలు అన్నారు. ఆదివారం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీ పంలోని జీఎస్సార్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలే కర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో టీడీపీ జనసేన కూటమి విజయాన్ని ఎవ రూ ఆపలేరన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కుతూ, కోట్లాది రూపాయలు దోచేస్తున్నా రని విమర్శించారు. జగన్ వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. జగన్ చేసిన అభివృద్ధి ఏమిటో చె ప్పాలని డిమాండ్ చేశారు. మద్యపాన నిషేధం, సీపీఎస్ రద్దు, పోలవరం ని ర్మాణం లాంటి హామీలు నెరవేర్చలేదన్నారు. జగన్‌కి నిజంగా బీసీలపై ప్రేమ ఉంటే విజయనగరంలో బీసీలకు ఎమ్మెల్సీ పదవి ఎందుకు ఇవ్వలేదని ప్ర శ్నించారు. అభివృద్ధి పేరుతో వైసీపీ పాలకులు దోచుకోవడం దారుణమన్నారు.



మాట్లాడుతున్న అయ్యలు

గాయత్రీ మాతను దర్శించుకున్న రాంమాధవ్

శృంగవరపుకోట రూరల్: మండలంలోని రాజీపేట గ్రామంలో ఉన్న శంబల నగరిలో కొలువై ఉన్న వేదగాయత్రి మాతను ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ కార్యవర్గ ప్రధా న సభ్యుడు రాం మాధవ్ ఆదివారం సాయంత్రం ద ర్శించుకున్నారు. ఈ సంద ర్భంగా ఆలయ ప్రతినిధులు మల్లిఖార్జునరావు, మురళీ కిశోర్, ప్రసాదరావు, వర్మ స్వాగతం పలికారు. ఆశ్రమ విశిష్టతను వివరించారు. కార్యక్ర మంలో ఎస్.కోట బీజేపీ నాయకుడు ప్రసాద్ ఉన్నారు.



శంబలనగరీ గాయత్రీమాతను దర్శించుకున్న రాంమాధవ్

జాగరం-అన్నంరాజుపేట కాలువ కప్పేశారు

జామి, జనవరి 28: జామి సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ నిర్మాణంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని జిల్లా అధికారులు దీనిపై దృష్టి సా రించాలని జామి మాజీ జడ్పీటీసీ బండారు పెద బాబు కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ హైవే నిర్మాణం పేరుతో జాగరం నుంచి అన్నంరాజుపేట వరకు ప్రవహించే పంటకాలువలను క ప్పేయడంతో రైతుల పొలాలకు నీరు అందని పరి స్థితి ఉందన్నారు. అదేవిధంగా జామి శ్మశానం వద్ద ఉన్న పంటకాలువను పూర్తి గా మూసేశారన్నారు. రైతులకు ఇబ్బందికరంగా వీరి పనులు ఉన్నాయని కాలు వలు చాలా వరకు మూసేయడం వల్ల గత వర్షాలకు కురిసిన నీరు ఇంకా పొలా లపైనే ఉందని తెలిపారు. వీరి చర్యల వల్ల రైతాంగం తీవ్రమైన ఇబ్బందులు ప డుతుందని, ఆర్థికంగా చితికిపోయారన్నారు. ఈ విషయాలపై అధికారులకు వివ రించి నా వారు పట్టించుకోలేదని వీటిపై నేటి గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదుచేస్తామని తెలిపారు.



పంటకాలువ దుస్థితి ఇది

కొండడాబాలో ప్రత్యేక ప్రార్థనలు

కొత్తవలస, జనవరి 28: కొండ డాబా వ్యాకుల మాత జాతర సంద ర్భంగా మూడో రోజు ఆదివారం సాయంత్రం దివ్య బలి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శృంగవర పుకోట, లక్కవరపుకోట, వేపాడ మండలాల నుంచి భక్తులు హాజరై పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విచారణ కర్త బాలరాజు బాలయేసు దేవాలయంలో తప్పిపోయినప్పుడు తల్లి మరియ పడిన వేదన గురించి వివరించారు. కార్యక్రమంలో విచారణ కర్తలు కి షోర్, జోజయ్య, రాజు గొంగాడ, పి.ఆనంద్ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న బాలరాజు

అబ్బూరు శతజయంత్యుత్సవ సభ

రాజాం: స్థానిక రాజాం రచయితల వేదిక, కేంద్ర సాహిత్య అకాడమీ సంయుక్తంగా ఆదివారం సా హితివేత్త అబ్బూరు వరదరాజేశ్వరరావు శత జయంత్యుత్సవ సభ నిర్వహించారు. ఈ సంద ర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ కన్వీనర్ సి.మృణాళిని మాట్లాడుతూ అబ్బూరు వరద రాజేశ్వరరావు తెలుగు సాహిత్యంలో బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. అబ్బూరి వరదరాజేశ్వరరావు జీవిత సాహిత్యాలపై పత్ర సమర్పణ చేశారు. కార్య క్రమంలో రచయితల వేదిక నిర్వాహకుడు గార రంగనాథం, చింతకింద శ్రీనివాసరావు, సమ్మెట మల్లేశ్వరరావు, ఎం.కృష్ణమూర్తి, అవదాల మణిబాబు, డీవీజీ శంకరరావు, పిల్లా తిరుపతిరావు, ఆల్తి మోహనరావు, శ్రీనివాసరావు, ఒమ్మి రమణమూర్తి, బాల సుధాకర, గంటేడ గౌరినాయుడు, మల్లిపురం జగదీష్, సిరికి స్వామినాయుడు, చీకటి దివాకర్, దాసుబాబు, పొన్నాడ నరసింహులు ,గరుగుబిల్లి జగన్నాథరావు, పెంకి దయానిధినాయుడు, పొట్నూరు కోటిబాబు, రాజాకు శాంతారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మృణాళిని

గ్రంథాలయాన్ని పునరుద్ధరించాలి

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో జెండా వీధి జంక్షన్‌లో పాత జవహర్ మున్సిపల్ స్కూలులో ఏర్పాటు చేసిన ప్రభుత్వ గ్రంథాలయాన్ని తక్షణం పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక ఎన్టీఆర్ కూడలిలో నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు జనసేన రాష్ట్ర కార్యనిర్వహణా కార్యదర్శి పాలూరు బాబు ఒక ప్రకటనలో తెలిపారు. శిధిలావస్థలో ఈ భవనానికి మరమ్మతులు చేయిస్తామని నెపం చూపి గ్రంథాలయాన్ని అక్కడ నుంచి ఖాళీ చేయించారని, మరమ్మతులు చేస్తామని మున్సిపల్ అధికారులు హడావిడి చేసి రెండు నెలలు కావస్తున్నప్పటికీ ఇంతవరకు అక్కడ ఒక్క ఇటుకను కూడా పేర్చలేదని ఆయన ఆరోపించారు.

31న రీజనల్ జాబ్‌మేళా

విజయనగరం దాసన్నపేట/కలెక్టరేట్: నగరంలోని సీతం ఇంజనీరింగు కళాశాలలో ఈ నెల 31న ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రీజనల్ జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి, సీతం కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు తెలిపారు. 87 బహుళజాతి కంపెనీలతో ఈ మేళాని నిర్వహించనున్నట్టు తెలిపారు. ఐటీ సెక్టార్, ఫార్మా, ఆటోమొబైల్, బ్యాకింగ్, టూరిజం, హస్పాటాలిటీ, రిటైర్డ్ జూయలరీ, నుంచి సుమారు 5,892 ఖాళీలు భర్తీ చేస్తామన్నారు. 10 నుంచి పీజీ వరకూ చదువుకున్న నిరుద్యోగ యువతీ, యువకులు హాజరుకావాలని, ఎంపికైన అభ్యర్థులకు విశాఖపట్టణం, ఏపీ, తెలంగాణలో ఉద్యోగం వుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

దేవుదలలో సత్సంగం

రేగిడి: మండలంలోని దేవుదల గీతామందిరంలో ఆది వారం దివ్యజీవన సత్సంగ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకొండకు చెందిన సత్యసాయిప్రతినిధి ఎన్‌వీ రమణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు సామంతులు దా మోదర్, సేవానంద స్వామి జీ మోహన్‌దాస్, కొత్తకోట ఉమ మహేశ్వరరావు, పెద్ద బుడ్డిడికి చెందిన చల్లంనాయుడులు పాల్గొన్నారు.

సంక్షేమమే ముఖ్యమంత్రి ధ్యేయం

వేపాడ: మహిళా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని శృంగవరపుకోట ఎమ్మెల్యే కడబండి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రం వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన 4వ విడత ఆసరా సంబరాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అక్కచెల్లమ్మల కోసం నాలుగో విడత ఆసరా నిధులను మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, ఎంపీ పీ దొగ్గ సత్యవంతుడు, జడ్పీటీసీ ఎస్.అప్పారావు తది తరులు పాల్గొన్నారు.

నేడు వీరబ్రహ్మేంద్ర ఆలయంలో తీర్థం

కొత్తవలస, జనవరి 28 : కొత్తవలస-కె.కోటపాడురోడ్డులోని ఆంజనేయపేట వద్ద కొలువైన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సోమవారం తీర్థం నిర్వహిస్తున్నట్టు విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సాంఘిక సంక్షేమ సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. తీర్థం సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నామన్నారు. సాయంత్రం ఆలయ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

విజయనగరం రూరల్, జనవరి 28: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ప్రస్తుతం ఉన్న సీపీఎస్ విధానం రద్దు చేయాలని కోరుతూ సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మున్సిపల్ హైస్కూల్ కస్పాలో పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు గంటా శ్రీనివాస్, సైలాడ అప్పలనాయుడు, వి రమణ, ఆర్ శివకుమార్, షేక్ ఇమామ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ఆర్ లక్ష్మణరావు, సహ అధ్యక్షుడిగా జె ఈశ్వరరావు, సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎంపీ రమణ, కోశాధికారిగా నాయుడు, మహిళా ప్రతినిధులుగా హెచ్ లలితాకుమారి ఎన్నికయ్యారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్ పరీక్ష

రాజాం: రాజాం ప్రభుత్వోన్నత పాఠశాలలో ఎన్‌సీసీ ఎ సర్టిఫికెట్ పరీక్షను ప్రెసిడెంట్ ఆఫీసర్ కెప్టెన్ ఎస్. వెంకటరావు ఆధ్వర్యంలో ఆధివారం జరిగింది. ఏడు పాఠశాలల నుంచి 235 మంది క్యాడెట్లకు 365 మార్కులకు పరీక్ష నిర్వహించగా డ్రిల్ పరీక్ష 135 మొత్తం 500 మార్కులకు జరిగింది. కార్యక్రమంలో జేసీవో దల్‌బీర్ సింగ్, బి.శ్రీనివా సరావు, ఏఎన్‌ఓ బీవీ అచ్యుతకుమార్, డి.ఉదయ్, పి.పుష్పలత, కె.హరి పాల్గొన్నారు.

ఉచిత ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం

బొబ్బిలి, జనవరి 28: బొబ్బిలి పట్టణంలోని శ్రీ యోగవిద్యాసంస్థ నిర్వాహకులు ఎంఈవీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత ఆక్యుపంక్చర్ వైద్య శిబిరానికి భారీ స్పందన లభించింది. విశాఖకు చెందిన యోగా, ఆక్యుపంక్చర్ హీలర్స్, నేచురోపతి కె. శ్రీధర్, సి. శ్రావణి, సౌజన్య పాల్గొని సుమారు వందమంది రోగులకు పరీక్షలు జరిపి చికిత్స చేశారు. దీర్ఘకాలికంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఆక్యుపంక్చర్ విధానం ద్వారా నయమవుతుందని తెలిపారు. స్థానిక యోగా కేంద్రం శిక్షకురాలు కె.సత్య తదితరులు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న దృశ్యం

అంబేడ్కర్ పేరు తొలగింపు అన్యాయం

● టీడీపీ విజయనగర నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి

విజయనగరం రూరల్: సీఎం జగన్ హయంలో దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందని విజయనగరం నియోజకవర్గ ఇంచార్జి అదితి విజయలక్ష్మి గజపతిరాజు వైకాపా ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నియో జకవర్గం పరిధిలోని ఎస్సీ, ఎస్టీ ప్రతినిధులతో అశోక్ బంగ్లాలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు అందాల్సిన పథకాలు, బెస్ట్ అవైల్‌బుల్ పాఠశాలలు రద్దుచేశారన్నారు. అంబేద్కర్ విదేశి విద్యకు మహాత్ముని పేరుని తోలగించి జగన్ పేరును పెట్టుకోవటం అంబేద్కర్‌ను అవమానించటమే నన్నారు.అలాగే ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు దారిమళ్లించి దళితులకు అన్యాయం చేశారన్నారు. దళితులపై దాడులు, హత్యలు, హాత్యాచారాలు జరుగుతున్నా- ప్రభుత్వం పట్టించుకోవటం లేదని విమర్శించారు. ఎస్సీ కుళాల ప్రతినిధులు మామిడి రవిశంకర్, గొండేలా ప్రకాష్ (కండువా ప్రకాష్), కంచుబా రికి పైడిరాజు, దాన రాంబాబు, దేవరాపల్లి రాంపైడి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదితి గజపతిరాజు

'బాబు ష్యూరిటీ' పై దిశానిర్దేశం

తెర్లాం, జనవరి 28: స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు ఆదేశాల మేరకు మండలపార్టీ నాయకులు నర్సుపల్లి వెంకటనాయుడు ఆధ్వర్యంలో రాజాం ఐటీడీపీ పర్యవేక్షకుడు శ్రీనుబాబు బూత్ ఇన్‌చార్జిలతో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చేపట్టాలని, చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టే పథకాలను ప్రజలకు తెలిసేలా అవగాహన కల్పించాలని బూత్ ఇన్‌చార్జిలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి సురేష్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి యుగంధర్, మండల సీనియర్ నాయకులు శంకరరావు, కరణం రమేష్, సర్పంచ్ జావాన రమేష్, బూత్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.



బూత్ ఇన్‌చార్జిలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కోళ్ల కుటుంబానికి అశోక్ పరామర్శ

లక్కవరపుకోట, జనవరి 28: టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు ఆదివారం మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి కుటుంబాన్ని ప రామర్శించారు. ఈ నెల 26న కీర్తిశేషులు కోళ్ల అప్పలనాయుడు భార్య పైడితల్లమ్మ మరణించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మూడోరోజున అశోక్‌గజపతిరాజు లలితకుమారి, రాంప్రసాద్ దంపతులను పరామర్శించారు. పైడితల్లమ్మ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. తమ సహచరుడు కోళ్ల అప్పలనాయుడుతో ఉన్న సంబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఇరువురూ టీడీపీ నుంచి ఏడుమార్లు అసెంబ్లీకి ఎన్నికైన సంగతిని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఐవీపీ రాజు, కరెడ్ల ఈశ్వరరావు, కొట్యాడ ఈశ్వరరావు, మల్లా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కోళ్ల కుటుంబాన్ని పరామర్శిస్తున్న అశోక్‌గజపతిరాజు

ఘనంగా ఏకాదశ రుద్రాభిషేకం

బొబ్బిలి, జనవరి 28: సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా సేవాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బొబ్బిలి వెలమ కమ్యూనిటీ భవనంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ కొరారుసాయి శ్రీహరి ప్రసాద్ శర్మ, సునీల్ కుమార్ రథో ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన పాల్గొని పూజలు చేశారు. నాయుడుకాలనీ వాసులే కాకుండా వివిధ ప్రాంతాలకు చెందిన సత్యసాయి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న బేబీనాయన

ఉపాధితోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి

● పల్సస్ సీఈవో గేదెల శ్రీనుబాబు

విజయనగరం దాసన్నపేట, జనవరి 28: ఉపాధి ఆంధ్రా ద్వారానే ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యమని పల్సస్ సీఈవో డాక్టర్ గేదెల శీనుబాబు అన్నారు. ఆదివారం నగరంలోని మెసా నిక్ టెంపుల్లో రైతు సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విజయనగరంలో పర్యా టక రంగంలో, ఆటవీ ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడం ద్వారా వేల ఉద్యో గాలు సృష్టించవచ్చునన్నారు. ఒకప్పుడు విజయనగరం కళలకు, సాంస్కృతి రంగాలకు పుట్టినిల్లు అని, నేడు కళాహీనంగా మారిందన్నారు. పల్సస్ గ్రూప్ ద్వారా ఆంధ్రాలో రైతు సదస్సు నిర్వహించి సరికొత్త ఆర్థిక విప్లవానికి నాంది పలుకుతున్నామన్నారు. ప్రతి రైతూ నిత్య విద్యార్థిగా ఉంటూ, సాంకేతికతను అలవర్చుకోవాలని, దాంతో ప్రతి రైతూ బిడ్డను ఒక పారిశ్రామిక వేత్తగా తీర్చిదిద్దవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో పల్స్ సంస్థ ప్రతినిధులు, తూర్పుకాపు ప్రతినిధులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనుబాబు

చీపురుపల్లి రోడ్డులో చెలరేగిన మంటలు


రాజాం: రాజాంలోని చీపురుపల్లి రోడ్డులో ఎర్రచెరువు గట్టుపై ఉన్న మర్రి చెట్టుకు ఎవరో గుర్తుతెలియని నిప్పంటించడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించడంతో హుటా హుటిన అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. దశాబ్దాల కిందట మర్రి చెట్టుకావడంతో అడుగుభాగం దెబ్బతినడంతో తొలగించాలని ఆర్‌అండ్‌బీ, మునిసిపల్ అధికారులను కోరుతున్నట్లు స్థానికులు తెలిపారు.

ప్రతిభను వెలికి తీసేందుకే బహుమతులు

దాసన్నపేట: విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకే ప్రోత్సాహక బహుమతులు అందచేస్తున్నామని గుంటూరు సుజాత, విద్యా సంస్థల డైరెక్టర్ వీఏరావు అన్నారు. ఆదివారం కొత్త అగ్రహారంలోని బెస్ట్ జూనియర్ కళాశాలలో 10వ తరగతి విద్యార్థులకు స్కాలర్ షిప్ టెస్ట్ నిర్వహించారు. 350 విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి స్థానం గిరీశం డిజిటల్ స్కూల్‌కు చెందిన జి.శ్రీవల్లీదేవి, రెండో స్థానంలో ఒంపిల్లి జడ్పీస్కూల్‌కు చెందిన పి.సౌజన్య, మూడో స్థానంలో గీతాంజలి హైస్కూల్ చెందిన కె.రోహిత్ నిలిచారు. వీరికి నగదు బహుమతితో పాటు, మోమెంటోలు అందచేసి సత్కరించారు. ఈ సందర్భంగా బీఏరావు మాట్లాడుతూ విద్యార్థులు, ఏకాగ్రత, ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. సి.ఐ మంగవేణి, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అనీల్, ఉమామహేశ్వర్, పైడిరాజు, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తచెలిగానవలసలో గడ్డివాము దగ్ధం

రేగిడి: మండలంలోని కొత్తచెలిగానవలసలో ఆదివారం రాకోటి అశిరయ్యకు చెందిన రెండెకరాల గడ్డివాము దగ్ధమైంది. బస్టాండ్ సమీపంలో పశువుల కోసం గడ్డి నిల్వ ఉంచారు. ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మంటలు వ్యాపించాయి. పాలకొండ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో చేరుకుని మంటలు అదుపుచేశారు. గడ్డివాములు కాలిపోవడంతో రూ. 20 వేలు నష్టం జరిగిఉంటుందని అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు.



కొత్తచెలిగానవలసలో మంటను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

పాలకవర్గం లేక.. పర్యవేక్షణ లేదు

● 18 ఏళ్లుగా ప్రత్యేకాధికారి పాలన

● ఇదీ రాజాం మునిసిపాలిటీలో పరిస్థితి

రాజాం రూరల్: రాజాం మునిసిపాలిటీలో 18 ఏళ్లుగా పాలకవర్గం లేకపోవడంతో పాలనపై పర్యవేక్షణ కొరవడింది. గ్రూప్-1స్థాయి అధికారిని కమిషనర్‌గా నియమిం చకపోవడంతో అధికారుల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నరన్న విమర్శలొస్తున్నాయి. దీనికితోడు అధికారపార్టీ నాయకుల ఒత్తిడి కూడా తోడవడంతో పాలన గాడి తప్పుతోంది. 18 ఏళ్లుగా ప్రత్యేకాధికారి పాలనకే పరిమితంకావడంతో సమస్యలు రాజమేలుతున్నాయి. ప్రధానంగా నగర పంచాయతీ నుంచి గ్రేడ్-2 మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ అయినా తాగునీరు, పారిశుధ్య వంటి సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. కుక్కలు, పందులతోపాటు మెయిన్‌రోడ్‌లో పశువులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. ఇక్కడ సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడంలేదు.

● ఇదీ పరిస్థితి..

రాజాం, సారధి మేజర్ పంచాయతీతో పాటు కొత్తవలస, కొండంపేట, పొనుగుటివలస గ్రామ పంచాయతీలను కలిపి 2005 అక్టోబరులో నగర పంచాయతీగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో కొత్తవలస, కొండంపేట, పొనుగుటివలస పంచాయతీల సర్పంచ్‌లు ప్రజలు నేరుగా ఎన్నుకున్న తమ ప్రమేయం లేకుండా నగర పంచాయతీలో విలీనం చేయడాని ఉమ్మడి రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. ఫలితంగా నేటివరకూ సమస్య కొలిక్కిరాలేదు. దీంతో ఎన్నికలకు నోచుకోలేదు.

తాగునీటికి తరచూ అంతరాయం..

మునిసిపాలిటీ ప్రజలకు తాగునీటి అవస్థలు తప్పడంలేదు. రేగిడి మండలం పరిధిలో నాగావళినదిలో ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల వద్ద ఏర్పాటు చేసిన మోటార్లు తరచూ మొరాయిస్తున్నాయి. దీనికితోడు పట్టణంలో ఏర్పాటుచేసిన పైపులు తరచూ లీకవుతున్నాయి. దీంతో తరచూ తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. అటు మోటార్లకు, ఇటు పైపులైన్లకు ఉమ్మితడి పనులు చేస్తూ అధికారులు మమ అనిపిస్తున్నారు. దీంతో తాగునీటికష్టాలు తప్పడంలేదు.




వర్షం పడితే మెయిన్‌రోడ్డుపైనే మురుగునీరు

పాతుకుపోయిన సిబ్బంది..

రాజాం మునిసిపాలిటీలో కమిషనర్‌తోపాటు 28 మంది శాశ్వత ఉద్యోగులు కాగా 118 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. నగర పంచాయతీ ఏర్పాటు నుంచి కొంతమంది సిబ్బంది అధికారపార్టీ నాయకుల ఒత్తిళ్లతో కీలక విభాగాల్లో పాతుకుపోయారు. ఈనేపథ్యంలో ప్రత్యేకాధికారి పర్యవేక్షణ సైతం అంతంతమాత్రంగా ఉండడంతో సిబ్బంది చెప్పిందేవేదంగా మారిందన్న విమర్శలొస్తున్నాయి.

విజయనగరంలో విలీనంచేసినా..

వైసీపీ ప్రభుత్వంలో కీలకంగా ఉన్న మంత్రి బొత్స సత్యనారాయణ రాజాంపై దృష్టిసారించడంలేదన్న ఆరోపణలొస్తున్నాయి. రాజాం నియోజకవర్గం విజయనగరం జిల్లాలో విలీనం చేసిన తర్వాత ఇక్కడ ప్రజలు బొత్సపై ఆశలు పెంచుకున్నారు. కోర్టును ఆశ్రయించిన మాజీ సర్పంచ్‌లతో చర్చలు జరిపి, న్యాయపరమైన వివాదాలు పరిష్కరించి, రాజాం మునిసిపాలిటీకి ఎన్నికలు జరిపించి పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతారన్న ఆశించారు. మరో మూడు నెలల్లో శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజాం మునిసిపాలిటీకి ఇప్పట్లో ఎన్నికల నిర్వహణ సాధ్యంకాదని పలువురు చెబుతున్నారు.



కొరగంజివీధి సమీపంలో పేరుకుపోయిన చెత్త (ఫైల్)

సిబ్బందికి తలకు మించిన భారం..

పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న పట్టణానికి అనుగుణంగా ప్రభుత్వం పారిశుధ్య సిబ్బందిని నియమించలేదు. దీంతో ఇప్పుడున్న పారిశుధ్యనిర్వహణ సిబ్బందికి తలకు మించిన భారంగా మారుతోంది. మెయిన్‌రోడ్ మినహాయిస్తే ప్రధాన వీధుల్లో సైతం మురుగుకాలువల్లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. పలుచోట్ల రోడ్లపైకి మురుగునీరు చేరుతోంది.

రోడ్డు ప్రమాదంలో లెక్చరర్ మృతి


మురళీకృష్ణ (ఫైల్)

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేస్తున్న ముడిలి మురళీకృష్ణ (52) రోడ్డు ప్రమాదంలో ఆదివారం మృతిచెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. మురళీకృష్ణ ఆదివారం సాయంత్రం తన బైకుపై గుమ్మలక్ష్మీపురం నుంచి తన స్వగ్రామం జియ్యమ్మవలస మండలం చినమేరంగి వెళ్తున్నారు. గుమ్మలక్ష్మీపురం మండలం మూలిగూడ జంక్షన్ వద్దకు వచ్చేసరికి స్కూటీ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆయన తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందినట్లు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. స్థానికులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం 108 వాహనంలో గుమ్మలక్ష్మీపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈ ఘటనపై గుమ్మలక్ష్మీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈయన మృతితో స్వగ్రామం చిన మేరంగిలో విషాదచాయలు అలముకున్నాయి. ఈయనకు భార్య కృష్ణవేణి, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఒప్పంద జీవోలు విడుదల చేయండి

- మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్

బెలగాం: మున్సిపల్ కార్మికుల సమస్యలపై చర్చల్లో అంగీకరించిన ఒప్పందాలకు సంబంధించి ప్రభుత్వం జీవో విడుదల చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం మీద నమ్మకంతో సమ్మె విరమించి 15 రోజులు గడుస్తున్నా చర్చల్లో చేసుకున్న ఒప్పందాలకు సం బంధించి జీవోలు విడుదల చేయకుండా జాప్యం చేస్తున్నాయని ఆగ్రహించారు. ఇంకా కొన్ని జీవోలు ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్లో ఉండడంతో సమ్మె కాలంలో వేతనం చెల్లించడంలో జాప్యం జరుగుతుందని అన్నారు. డ్రైవర్లకు రూ.24,500, దహన సంస్కార ఖర్చులు రూ.20వేలు చెల్లింపు, విధుల్లో చనిపోయినవారికి నష్టపరిహారం, బకాయిలు, సరెండర్ లీవ్‌లు, 23 శాతం వేతనం పెంపు తదితర ఒప్పందాలకు సంబంధించిన జీవోలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నాలు చేస్తామని చెప్పారు. ఇంజినీరింగ్ కార్మికులకు ప్రభుత్వం నియమించిన తొమ్మిది మంది కమిటీ వెంటనే స్కిల్డ్ సొసైటీ ద్వారా వేతనాలు అమలు ప్రారంభించాలని, ఈ మేరకు ఎమ్మెల్యేలకు వినతిపత్రం ఇస్తామని తెలిపారు. కాఫా ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పరిష్కరించాలని లేదంటే మరో పోరాటం తప్పదని హెచ్చరించారు. సమ్మె అనుభవాలను వివరిస్తూ ముద్రించిన ప్రచార పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జి.వెంకటరమణ, యూనియన్ నాయకులు శంకర్రావు, రాముడు, సింహాచలం, శివ పాల్గొన్నారు.

గిరిజనుల హక్కులను కాపాడాలి


మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

బెలగాం: గిరిజనుల హక్కులను కాపాడాలని, కురుపాంలో నిజమైన గిరిజనులకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని గిరిజన సంఘాల జేఏసీ నాయకులు కె.ధర్మారావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గిరిజన భవన్‌లో గిరిజన సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజనేతరులకు భూములు కేటాయించ వద్దని, కోనేరు రంగారావు కమిటీ సూచించిన జీవో అమలు చేసి గిరిజనుల వలసలు నివారించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబరు 3కు బదులుగా కొత్త రెగ్యులేషన్ పాలసీ అమలు చేయాలని, జగనన్న భూహక్కు పథకం షెడ్యూల్డ్ ప్రాంతాల్లో 1959ని ప్రామాణికంగా తీసుకోవాలని టీఏసీలో 13 మంది ఎస్టీ ఎమ్మెల్యేలను నియమించి బలోపేతం చేయాలని, నకిలీ ఎస్టీ ధ్రువపత్రాల రద్దుపై ప్రత్యేక కమిటీ నియమించి త్వరితగతిన విచారించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఎస్టీ రిజర్వేషన్ నియోజకవర్గాల్లో నిజమైన గిరిజనులకే సీట్లు ఇవ్వాలని, బోయ వాల్మీకులను ఎస్టీలో చేర్చవద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల జేఏసీ నాయకులు ఎ.నీలకంఠం, డి.సీతారాం, కె.ఉదయ్, కె.గౌరమ్మ, కె.జయన్న, ఐ.రామకృష్ణ, ఎల్ల లోవరాజు, పువ్వల అప్పన్నదొర, పువ్వల సత్యనారాయణ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలి


నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ

నెల్లిమర్ల: రామతీర్థం సేవా సంఘం చేపడుతున్న కార్యక్రమాలు అందరికీ ఆదర్శనీయమని ఉపాధ్యా య ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. సేవా సంఘం విస్తృత కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. ఆధ్యాత్మిక కేంద్రాలు, పర్యాటక ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు, సంఘాల కార్యక్రమాలు మరింత విస్తృతం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈసందర్భంగా జరిగిన కార్యవర్గ ఎన్నికల్లో తిరిగి పాత కార్యవర్గాన్ని కొనసాగించేందుకు తీర్మానించారు. ఇటీవల అయోధ్య బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని రామతీర్థంలో శోభాయాత్రకు ఆర్థిక సహకారం అందించిన బాడాన రాజశేఖర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు బాలాజీ, అధ్యక్షుడు రేగాన గోవిందరావు, కార్యదర్శి సుదర్శనం విజయ్‌కుమార్, కార్యనిర్వాహక అధ్యక్షుడు సముద్రపు రామారావు, ఉపాధ్యక్షుడు ఆల్తి శ్రీనివాసరావు, కోశాధికారి ముంతా వర ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ పెన్షన్ కోసం ఐక్యంగా పోరాడుదాం


కార్మికులతో మాట్లాడుతున్న గౌరినాయుడు

చీపురుపల్లి: ఈపీఎఫ్ పెన్షన్ పెంపుదల కోసం కార్మికులంతా కలిసికట్టుగా పోరాటం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలో వారు ఆదివారం గని కార్మికులతో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఈపీఎఫ్ కార్మికులకు కనీసం రూ.500 నుంచి గరిష్ఠంగా రూ.800 మాత్రమే వస్తుందన్నారు. ఈ మొత్తాన్ని రూ.7500కి పెంచాలని, డీఏ కూడా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. జాతీయ ఈపీఎఫ్ పెన్షన్ సాధన కమిటీ దీనిపై పోరాటం చేస్తోందన్నారు. దీనికి కార్మికులంతా మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గరివిడి మాజీ ఎంపీపీ కోణిసి కృష్ణంనాయుడు, కార్మిక సంఘం ప్రతినిధులు అంబల్ల గౌరినాయుడు, టీవీ రమణ, ఎస్.సలీమ్, కేకే నాయుడు, పి.రామమూర్తి, ఎస్.తాతారావు, పి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

డెంకాడ: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీపీ బి.వాసుదేవరావు అధ్యక్షతన ఆదివారం వైఎస్ఆర్ ఆసరా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని, చెక్కులు అందజేశారు. మండలంలోని సుమారు 1,190 సంఘాలకు, 12,457 మంది అక్కచెల్లమ్మలకు రూ.44.40కోట్లు పంపిణీ చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ తమ్మినాయుడు, తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఎంపీడీవో స్వరూపారాణి, మండల అధికారులు, నాయకులు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు. ● **గరుగుబిల్లి:** మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపీపీ ఉరిటి రామారావు అధ్యక్షతన ఆదివారం వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి పాల్గొని, చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల జడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ పి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో సంఘ నేతకు టీడీపీ నాయకుల పరామర్శ

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ఏపీ ఎన్జీవో సంఘం నాయకుడు జీవీఆర్ కిషోర్‌కుమార్ తల్లి జి.సూర్యకాంతం ఆదివారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆమె కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కొమరాడ తదతర ప్రాంతాల్లో ఆమె పనిచేశారు. ఆమె మృతి పట్ల ఎమ్మెల్యే జోగారావు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో వాగ్దేవి, డీఎంహెచ్‌వో జగన్నాథరావు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి, కిషోర్ కుటుంబాన్ని ఓదార్చారు.

వైసీపీని ఓడించేందుకు సిద్ధం

- కార్యకర్తలకు పిలుపునిచ్చిన టీడీపీ నాయకులు
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలి

వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడించేందుకు కార్యకర్తలంతా సిద్ధంగా ఉండాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పలుచోట్ల ఆదివారం సమావేశాలు నిర్వహించి, పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని సూచించారు.

ఇక మిగిలింది 74 రోజులే..

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: వైసీపీని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. జగన్‌రెడ్డికి కౌంట్‌డౌన్ మొదలైందని, ఇక మిగిలింది 74 రోజులు మాత్రమేనన్నారు. వైసీపీ దురాఘాతాలకు ప్రజాకోర్టులో శిక్షపడే సమయం ఆసన్నమైందన్నారు. జగన్‌రెడ్డి అహంకారానికి, వైసీపీ అరాచకాలకు స్వస్తి పలికేందుకు రైతులు, యువత ప్రభుత్వ ఉద్యోగులు అంతా సిద్ధమయ్యారన్నారు. మద్యం ధరలతో పాటు ఆర్టీసీ బస్సు చార్జీలు, విద్యుత్ చార్జీలను పెంచుతూ ప్రజలను దోచుకుంటున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా ఓటు హక్కు ద్వారా బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మజ్జి వెంకటేష్, పి.సత్యనారాయణ, కోలా మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రావాలి


సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న భూదేవి

సీతంపేట: గిరిజనులు అభివృద్ధి చెందాలంటే రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని టీడీపీ సీనియర్ నాయకురాలు పడాల భూదేవి స్పష్టం చేశారు. దిగువ దారబ గ్రామంలో ఆదివారం నిర్వహించిన బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సవర కుంపి, మాజీ ఎంపీటీసీ బి.జయలక్ష్మి, సవర జగ్గయ్య, శ్రీకాంత్, దనమయ్య, లక్ష్మణరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు జైలు భయం పట్టుకుంది


మాట్లాడుతున్న సత్యనారాయణ

గరుగుబిల్లి: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి జైలు భయం పట్టుకుందని నాగూరు ఎంపీటీసీ సభ్యుడు, టీడీపీ అరకు బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆయన చిలకాం గ్రామంలో విలేకర్లతో మాట్లాడారు. ఒకసారి అని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారన్నా రు. సొంత సోదరికి న్యాయం చేయలేని జగన్ రాష్ట్ర ప్రజలకు ఎలా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపించే సమయానికి వైసీపీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు అధికంగా టీడీపీలో చేరే పరిస్థితులు ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో అరకు తెలుగుదేశం పార్టీ రైతు విభాగం కార్యదర్శి కండేన బలరాంనాయుడు, అక్కేన నారాయణరావు ఉన్నారు.

కౌంట్‌డౌన్ మొదలైంది


మాట్లాడుతున్న బంగార్రాజు

భోగాపురం: జగన్మోహన్‌రెడ్డికి కౌంట్‌డౌన్ మొదలైందని టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. ఆదివారం పోలిపల్లి గ్రామంలోని తన స్వగృహంలో ఆయన మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డికి మిగిలింది 74 రోజులు మాత్రమే అన్నారు. వైసీపీ దురాగతాలకు ప్రజాకోర్టులో శిక్షపడే సమయం ఆసన్నమయిందన్నారు. వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలికేందుకు రైతులు, యువత, ఉద్యోగులు సిద్ధమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో తోగులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి


మాట్లాడుతున్న మధుసూదనరావు

గరుగుబిల్లి: వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజలకు వివరించాలని టీడీపీ మండల అధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు అన్నారు. ఆదివారం సంతోషపురంలో సర్పంచ్ అంబటి తవిటి నాయుడు అధ్యక్షతన క్లస్టర్ పరిధిలోని టీడీపీ ప్రతినిధులకు శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లకు పైగా ప్రజలు పలు సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలు, గ్రామ కమిటీ అధికారులకు పలు అంశాలపై అరకు పార్లమెం టు శిక్షణ కోఆర్డినేటర్ వి.వెంకటేష్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు కృష్ణంనాయుడు, ఎం.నారాయణస్వామి, ఎం.రామారావు, జి.కిషోర్, సీతంనాయుడు, వై.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జగన్ ఓటమిని అంగీకరించినట్టే..

విజయనగరం రూరల్: రానున్న ఎన్నికల్లో జగన్ ఓటమిని ముందే అంగీకరించినట్టయిందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. భీమిలి వేదికగా సీఎం జగన్మోహన్‌రెడ్డి టీడీపీ, జనసేన పార్టీలు, ఆ పార్టీనేతలపై చేసిన వ్యాఖ్యలను ఆదివారం పార్టీ కార్యాలయంలో విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజుతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆ సభలో జగన్ మాట్లాడుతున్న మాటలు హస్యాస్పదంగా ఉన్నాయన్నారు. తల్లిని, చెల్లిని మోసం చేసిన జగన్ రాష్ట్రానికి ఏమి చేస్తారని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా టీడీపీకి మద్దతు ఇవ్వాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, కనకల మురళీమోహన్, కంది మురళీనాయుడు, కర్రోతు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డిని ఓడించేందుకు సిద్ధం


మాట్లాడుతున్న జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: జగన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ కురుపాం నియోజకవర్గం ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో ఆదివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ దురాగతాలకు ప్రజా కోర్టులో శిక్షపడే సమయం ఆసన్నమైందన్నారు. 2024 ఎన్నికల తర్వాత వైసీపీ జెండా కనుమరుగవుతుందన్నారు. గత ఐదు సంవత్సరాల్లో ఒక్క ప్రాజక్టు కూడా పూర్తి చేయలేదని, టీడీపీ అధికారంలోకి రాగానే ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటరావు, పోలూరు శ్రీనివాసరావు, బుజ్జేశ్వరరావు, జానకి, రాజేష్, మురళీ, చిన్న తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో కొనసాగుతున్న చేరికలు


పార్వతీపురం: పార్టీలో చేరినవారితో విజయచంద్ర

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురం నియోజకవర్గంలో టీడీపీలో చేరికలు కొనసాగుతున్నాయి. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో ఇప్పటికే సీతానగరం మండలంతో పాటు పార్వతీపురం పట్టణం, పార్వతీపురం మండలం నుంచి పెద్దఎత్తున పార్టీలో అనేకమంది చేరారు. తాజాగా ఆదివారం పార్వతీపురం పట్టణం నుంచి వివిధ వార్డులకు చెందిన పి.శ్రీరామ్మూర్తి, పీవీ కిషోర్, డి.శ్రీనివాస్, ఏ.సత్యనారాయణ, జేవీడీ ప్రసాద్, ఎస్.వెంకటేష్, భాను, సంతు, కళ్యాణి, వినయ్, కిరణ్‌కుమార్, సాయికుమార్, శ్రీకాంత్, తదిరులు టీడీపీలో చేరారు. వీరికి నియోజకవర్గ ఇన్‌చార్జి విజయచంద్రతో పాటు పార్టీ పట్టణ కార్యదర్శి మజ్జి వెంకటేష్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి.సత్యనారాయణ, కోలా మధుసూదనరావు తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దంపేట చిలకలపల్లిలో 100 కుటుంబాల చేరిక

సీతానగరం: పెద్దంపేట చిలకలపల్లి పంచాయతీలో వైసీపీకి చెందిన వంద కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఆదివారం స్థానిక టీడీపీ మండల కార్యాలయంలో పార్వతీపురం నియోజకవర్గం ఇన్‌చార్జి బోనెల విజయ్‌చంద్ర, పార్టీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్‌నాయుడు సమక్షంలో వీరు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఆర్.రామారావు, ఆర్.కాశి, బి.సురేంద్ర, జి.గౌరునాయుడు, కల్లూరి గౌరి, పడాల ఆదినారాయణ, శంకరరావు, సింహచలం తదితరులు పాల్గొన్నారు.

తమ్మినాయుడుకు అభినందనలు


తమ్మినాయుడును అభినందిస్తున్న దళిత నాయకులు

పూసపాటిరేగ: టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన మాజీ మంత్రి పతివాడ తనయుడు, పతివాడ తమ్మినాయుడుకు పలువురు నియోజకవర్గానికి చెందిన దళిత నాయకులు ఆయన స్వగ్రామమైన చల్లవానితోట గ్రామంలో కలిసి అభినందనలు తెలిపారు. దళితులకు అండగా ఉండాలని ఆయనను కోరారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ దళితుల అభివృద్ధికి టీడీపీ ఎంతగానో కృషి చేసిందని, వచ్చే ఎన్నికల్లో పార్టీకి అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ కమిటీ నుంచి పోతల రాజప్పన్న, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి గంధవరపు హరిబాబు, వీరితో పాటు నెల్లిమర్ల నియోజకవర్గానికి చెందిన పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో వైసీపీ నాయకుల చేరిక

పాలకొండ: పట్టణానికి చెందిన వైసీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ కారెపు చిట్టిబాబు తన అనుచరులతో ఆదివారం బీజేపీలో చేరారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో పార్వతీపురం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపూడి శ్రీనివాసరావు ఆయనకు కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టంకాల దుర్గారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట తిరుపతిరావు, పార్టీ వీరఘట్టం మండల అధ్యక్షుడు బురిడి సీతామహాలక్ష్మి, పొట్నూరు కోటేశ్వరరావు, సీతంపేట మండల అధ్యక్షురాలు అమల, పాలకొండ నియోజకవర్గం బీజేపీ అధ్యక్షుడు గంట అప్పలనాయుడు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో 'చదవడం మాకిష్టం'

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం అనే కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ● **బాడంగి:** చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో అధికారి ఆర్.దుర్గాప్రసాద్ పిల్లలతో కథల పుస్తకాలు చదివించారు. ● **శృంగవరపుకోట:** స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వాహకుడు శ్రీధర్ ఆధ్వర్యంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా పిల్లలకు పుస్తకాలు చదివించారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

- పార్టీ పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి విజయచంద్ర

సీతానగరం: టీడీపీతోనే అభివృద్ధి జరుగుతుందని పార్టీ పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర అన్నారు. మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో, సీతానగరం మండలం అప్పయ్యపేట గ్రామంలో జయహో బీసీ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా బీసీలకు టీడీపీ చేసినటువంటి పలు అభివృద్ధి కార్యక్రమాల పోస్టర్లు ఆయన చేతులమీదుగా విడుదల చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేసిందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో రౌతు వేణుగోపాల్‌నాయుడు, పోల సత్యనారాయణ, బొమ్మినాయని లక్ష్మణరావు, గొట్టాపు వెంకటినాయుడు, శంబాన శ్రీనివాసరావు, గొట్టాపు అప్పారావు, టీడీపీ నాయకులు ఎం.అప్పారావు, పి.రామన్‌రావు, అరకు పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు బి.రవికుమార్, జి.బాబ్జీ పాల్గొన్నారు.

ఖేలో ఇండియాలో సత్తా చాటారు


పతకాలతో హారిక, రాము

నెల్లిమర్ల: చెన్నైలో జరుగుతున్న ఖేలో ఇండియా యూత్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో కొండవెలగాడ గ్రామానికి చెందిన బెల్లాన హారిక 59 కిలోల కేటగిరిలో పాల్గొని స్నాచ్‌లో 73 కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 93 కిలోలు మొత్తం 166 కిలోల బరువు ఎత్తి తృతీయ స్థానం సాధించింది. అలాగే అదే గ్రామానికి చెందిన వి.రాము 89కిలోల విభాగంలో పాల్గొని స్నాచ్‌లో 126 కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 166 కిలోలు మొత్తం 292 కిలోలు బరువు ఎత్తి ప్రథమ స్థానం సాధించాడు. వీరిని జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బెల్లాన లక్ష్మీ నాగేంద్ర, కార్యదర్శి చల్లా రాము, రాష్ట్ర వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి థింసాబాబు, బడేటి వెంకటరామయ్య తదితరులు అభినందించారు.

విద్యారంగ సమస్యలపై 'చలో విజయవాడ'

పాలకొండ: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.అనీల్, జి.ఉమామహేశ్వరరావు తెలిపారు. పాలకొండ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రధానమైన సమస్యలపై ఆదివారం కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బీటీఏ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

ఆడలిలో రెస్టారెంట్‌కు టెండర్ల ఆహ్వానం

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న ఆడలి వ్యూపాయింట్ వద్ద రెస్టారెంట్, క్యాంపింగ్ టెంట్లు ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ చైర్మన్, కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి ఫిబ్రవరి 7 వరకు టెండర్లు స్వీకరిస్తామని చెప్పారు. అదేరోజు టెండర్లను తెరుస్తామని, టెండర్లకు పాల్గొన్నవారు రూ.2,500 చెల్లించి టెండర్ ఫారాలను తీసుకోవాలని కోరారు. సంవత్సరానికి అద్దె రూ.25లక్షలుగా నిర్ణయించామని చెప్పారు. పూర్తి సమాచారానికి జిల్లా పర్యాటక సాంస్కృతిక అధికారి 8919168306ను సంప్రదించాలని ఒక ప్రకటనలో కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పాచిపెంట: రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను మంజూరు చేస్తోందని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఆదివారం స్థానిక జీజే కళాశాల ఆవరణలో వైఎస్ ఆసరా నాలుగో విడత రుణమాఫీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు సంస్థ అధికారులు, సిబ్బంది, నాయకులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన హోమం

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయంలో ఆదివారం సుదర్శన హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సుదర్శన హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.


సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు

వారణాశి యాత్రకు వృద్ధులు

ఒడిశా


ప్రయాణికులకు వీడ్కోలు పలుకుతున్న మంత్రి సరక

రాయగడ: వయో వృద్ధుల తీర్థయాత్ర పథకంలో భాగంగా ఆదివారం రాయగడ నుంచి వారణాశికి ప్రత్యేక రైలు బయలుదేరింది. ఈ రైలును రాష్ట్ర మంత్రి జగన్నాథ సరక ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఆరు జిల్లాలకు చెందిన మొత్తం 970 మంది వృద్ధులు ఈ యాత్రకు బయలుదేరా రు. వృద్ధులకు అన్నివిధాల సహాయ సహకారం అందించేందుకు ప్రభుత్వం ఎంపికచేసిన 30 మంది సహాయకులను వారికి తోడుగా పంపించారు. ఈసందర్భంగా వృద్ధులు మాట్లాడుతూ ఇంత మంచి పథకం ప్రవేశపెట్టి భగవంతుని దర్శన భాగ్యం కల్పిస్తున్న ముఖ్య మంత్రి నవీన్ పట్నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా రైల్వేస్టేషన్ ప్రాంగణంలో జరిగిన సభలో తీర్థయాత్రల పథకం సమ న్వయకర్త దుర్గాప్రసాద్ సామంత్రయ్, జడ్పీ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, శాసన సభ్యుడు మకరంద ముదిలి, ఎస్పీ వివేకనంద శర్మ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.